సాక్షి
ఏలూరు

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



తణుకులో కారు బీభత్సం

తణుకు పరిధిలోని జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. బైక్‌ల పైకి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. IIలో ▸



రేషన్ బియ్యం పట్టివేత

నూజివీడులో ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. చిన్ని శ్రీనివాస్ బియ్యాన్ని తరలించేందుకు నిల్వ ఉంచగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. IIలో ▸

ప్రగతి సాధకులు.. ఇంజనీర్లు



మానవాళి ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర కీలకం. మానవ జీవనాన్ని సులభ తరం చేసిన ఆవిష్కరణల రూపకల్పనలో వారి కృషి ఎనలేనిది. నేడు జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. IIలో

న్యూస్‌రీల్

ఏడీజే కోర్టు ఏర్పాటుకు కృషి



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో ఏడీజే కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పట్టణ న్యాయవాదులకు హామీ ఇచ్చారు. పట్టణానికి చెందిన న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొవ్వూరి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం ఉప ముఖ్యమంత్రి నివాసం వద్ద ఆయనను కలిసి అపరిష్కృతంగా ఉన్న ఏడీజే కోర్టు విషయంపై వినతి పత్రం అందజేశారు. మంత్రి ఈ సందర్భంగా ఫైనాన్స్ సెక్రటరీతో ఫోన్‌లో సంభాషించారు. ఏడీజే కోర్టుకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం ప్రకటించారు. ఈఎస్ఐ ఆసుపత్రిని పట్టణంలో ఏర్పాటు చేయాలని న్యాయవాదులు విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ దాసం సునీల్ కుమార్, సీనియర్ న్యాయవాదులు కొల్లి సుబ్రహ్మణ్య శర్మ, గొల్లపూడి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, ఆర్ఎస్‌వీ సోమేశ్వరరావు, ధనమూరి సతీష్, దూలం రత్నశేఖర్, ముళ్ళపూడి శ్రీనివాసరావు, తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు 16, 17న ఆన్‌లైన్ పరీక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, ఈ–డివిజనల్ మేనేజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్‌లో ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, భీమవరం డివిజన్‌లో ఈ–డివిజనల్ మేనేజర్ మొత్తం రెండు పోస్టులు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఎనిమిది డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులను పొరుగు సేవల పద్ధతిలో భర్తీకి గత నెలలో నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, ఈ–డివిజనల్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలు సెప్టెంబర్ 16న, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలను సెప్టెంబర్ 17న భీమవరం బీవీ రాజు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఉద్యోగులకు నేడు ప్రత్యేక స్పందన

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమ గోదావరి జిల్లా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భీమవరం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో 15న ఉద్యోగుల స్పందన నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ఫిర్యాదులు, సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రతి నెలా మూడవ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

దశాబ్దాల కల సాకారం

- కార్పొరేట్‌కు దీటుగా ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల
- రూ. 60 కోట్లతో అధునాతన హంగులతో కూడిన భవనం
- ఈ ఏడాది 150 ఎంబీబీఎస్ సీట్ల భర్తీ
- ఇప్పటికే 120 మంది విద్యార్థులకు అడ్మిషన్లు జారీ
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఏలూరులో నేడు సీఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం

సాక్షిప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు దాదాపు 40 ఏళ్ల కల. అనేక ప్రభుత్వాలు వచ్చి వెళ్లాయి. ఎన్నో విజ్ఞాపనలు అందజేసినా అవేవీ సాకారం కాలేదు. అయితే ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో దశాబ్దాల కలగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు సాకారమైంది. రూ. 60 కోట్ల వ్యయంతో సర్వహంగులతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో కళాశాల భవనాన్ని నిర్మించారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్‌గా ఈ మెడికల్ కళాశాలను ప్రారంభించి అనంతరం విద్యార్థులతో మాట్లాడతారు. ఏలూరు నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కేవలం రెండేళ్లలోనే మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఐదు మెడికల్ కళాశాలలు నేడు లాంఛనంగా ప్రారంభిస్తున్నారు. విజయనగరంలో ఉదయం 11.40 గంటలకు మెడికల్ కళాశాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారు. అనంతరం వర్చువల్ విధానం ద్వారా ఏలూరు మెడికల్ కళాశాలను ప్రారంభిస్తారు. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



డిజిటల్ క్లాస్ రూమ్



అధునాతన ప్రయోగశాల

రూ.60 కోట్లతో అధునాతన సౌకర్యాలు

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలను రూ.60 కోట్లతో నిర్మించారు. భవనాన్ని జీ ప్లస్ టు గా అత్యాధునిక సౌకర్యాలతో, కార్పొరేట్ లుక్‌తో తీర్చిదిద్దారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షణలో వైద్య కళాశాల భవనాన్ని మెగా ఇంజనీరింగ్ కంపెనీ నిర్మించింది. ఏలూరు నగరానికే తలమానికంగా వైద్య కళాశాల భవనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవనంలో వైద్య కళాశాల సిద్ధం చేశారు. నిధులకు ఎక్కడా ఆటంకం లేకుండా పూర్తి స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం చేపట్టారు.

అత్యాధునిక ల్యాబ్‌ల ఏర్పాటు

ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మూడు అత్యాధునిక ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. హిస్టాలజీ ల్యాబ్, హెమటాలజీ ల్యాబ్, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లను అత్యాధునిక పరికరాలతో నిర్మించారు. ఒక్కో ల్యాబ్‌కు సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకూ వెచ్చించి మరీ ఏర్పాటు చేశారు. మెడికల్ కాలేజీలో రెండు అత్యాధునిక సౌకర్యాలతో డిజిటల్ లెక్చర్ హాళ్లు, మూడు ల్యాబ్‌లతో పాటు, ఏడు టీచింగ్ రూమ్స్, రెండు సెమినార్ హాళ్లు, ప్రిన్సిపాల్ క్యాబిన్, వైస్ ప్రిన్సిపాల్, స్టాఫ్ రూమ్స్, రెండు మెట్ల దారితోపాటు, లిఫ్ట్ సౌకర్యం , ప్రతి అంతస్తులోనూ వేర్వేరుగా టాయిలెట్స్, స్టాఫ్‌కు ప్రత్యేకంగా టాయిలెట్స్ ఏర్పాటు చేశారు.

ఏలూరుకే తలమానికం



ఏలూరు జిల్లాకే తలమానికంగా ప్రభుత్వ వైద్యకళాశాల నిలుస్తుంది. వైద్యకళాశాలను మంజూరు చేయాలని కోరిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అంగీకరించి ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రంతో ఆమోదించేలా చర్యలు తీసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ వైద్యశాలను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం.

– ఆళ్ళ నాని, మాజీ మంత్రి, ఏలూరు ఎమ్మెల్యే

కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశాం. కార్పొరేట్ స్థాయి హంగులతో భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మూడు ల్యాబ్‌లు ఇప్పటికే మొదటి ఏడాది విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలలో 120 మంది వైద్య విద్య అభ్యసిస్తున్నారు. హెల్త్ యూనివర్సిటీ రెండో కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేస్తే 150 సీట్లు భర్తీ అవుతాయి. అన్ని సౌకర్యాలతో హాస్టల్ వసతి కల్పించాం.

– డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల, ఏలూరు

చంద్రబాబు, పవన్‌ను ప్రజలు నమ్మరు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



వీరవాసరం: చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ను ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం వీరవాసరం మండలంలోని మత్స్యపురిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలకు మేలు జరుగుతుంటే సహించలేని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తమ అక్కసును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై చూపిస్తున్నారని అన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి సభల పేరుతో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుని సభ ముగిసిన వెంటనే ఆ దరఖాస్తులను చెత్తకుప్పల్లోకి పడేసేవారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో 98 శాతానికి పైగా హామీలు అమలు చేశారన్నారు. 2014 ఎన్నికలలో చంద్రబాబు 600కు పైగా హామీలు ఇచ్చి ప్రజలను మోసగించారన్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు.

పవన్ జనసైనికుల్ని వెన్నుపోటు పొడిచారు

వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ



తణుకు టౌన్: చంద్రబాబు అధికారం కోసం తన సొంత మామను వెన్నుపోటు పొడిస్తే.. జనసేన కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళల ఆశయాలకు వెన్నుపోటు పొడుస్తూ దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ అవినీతి కేసులో అరెస్టయిన చంద్రబాబు నాయుడుకు మద్దతు ప్రకటించడం రాజకీయాల్లో అనైతిక విలువలకు పరాకాష్ట అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. గురువారం ఆయన తణుకులో విలేకరులతో మాట్లాడుతూ.. వెన్నుపోటుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబును మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాననడంలో పవన్ కల్యాణ్ ఔచిత్యం బయటపడిందన్నారు. పవన్ కల్యాణ్‌కు చెగువేరా ఆశయాలు లేవని, పుచ్చలపల్లి సుందరయ్య జీవిత చరిత్రలో చిటికెడు ఆశయం కూడా లేదని అర్థమైందన్నారు.

దత్తపుత్రుడి కలలు కల్లలే..

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ద్వారకాతిరుమల: దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నాడని, అవి కలలుగానే మిగులుతాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలో గురువారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ.. దత్తపుత్రుడు పవన్ టీడీపీ పొత్తుతోనే పోటీ చేస్తాడని మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ చెబుతోందని, ఇప్పుడు ఆ ముసుగును ప్యాకేజీ స్టార్ తొలగించాడని అన్నారు. జైలు పాలైన చంద్రబాబును చూసి లోకేష్ కంటే, పవనే ఎక్కువగా బాధపడుతున్నారని అది ప్యాకేజ్ మహిమ అని అన్నారు. జైల్లో చంద్రబాబును కలిసి పవన్ కల్యాణ్ ప్యాకేజ్ మాట్లాడుకున్న తరువాత పొత్తుల ముసుగును ఆయన తొలగించారన్నారు. చంద్రబాబునాయుడు అవినీతి చేయలేదని ఆయన గానీ, ఆయన తరపు లాయర్లు గానీ ఎక్కడా చెప్పడం లేదని, అరెస్టు చేసేందుకు గవర్నర్ అనుమతి తీసుకోలేదని మాత్రమే వాదిస్తున్నారని అన్నారు. పవన్ కల్యాణ్ ఒక గజదొంగకు మద్దతు ఇస్తున్నాడని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలే కాలగర్భంలో కలిపేస్తారని ఆయన పేర్కొన్నారు.

21 నుంచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

17 గోపన్నపాలెంలో జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆవరణలో బాలబాలికలు, మహిళలు, పురుషుల రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లాల అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 17న దెందులూరు నియోజకవర్గం గోపన్నపాలెంలో నిర్వహిస్తామని వెల్లడించారు. స్థానిక ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో జరిగే ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. అండర్ 14, 16, 18, 20, 23 వయసుల వారికి వేర్వేరుగా పోటీలు చేపడతామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 10వ తరగతి మార్క్‌లిస్ట్ లేదా వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. పోటీదారులు రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 62814–31202, 76600–59833 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలోనే మేలు జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం వేచిఉండాల్సి వచ్చేదని, చనిపోయిన వారి స్థానంలో కొత్త పింఛనుదారులను చేర్చేవారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో అర్హులైన వారందరికి పింఛన్లు అందచేస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి కొత్తగా 1,702 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం మొత్తం 32,252 మందికి పింఛన్లు అందచేస్తున్నామన్నారు. ఒక్క తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోనే రూ.10 కోట్లు నగదును పింఛన్ల రూపంలో ప్రతి నెలా ఇస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. జగన్ ప్రభుత్వంలో ఒక్క రూపాయి లంచం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. త్వరలో జగనన్న ఆరోగ్య కేంద్రాలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 108 అంబులెన్సు సేవలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వినూత్న పథకాలతో పేద ప్రజలకు మేలు చేశారన్నారు. ఉచిత విద్యుత్‌తో వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. తండ్రిని మించిన తనయుడిగా జగన్‌మోహనరెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహనరెడ్డిని మళ్ళీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనం లబ్ధిదారులకు పింఛన్లను అందచేశారు. కార్యక్రమంలో ముత్యాల ఆంజనేయులు, కర్రి భాస్కరరావు, భావన ధాన్యలక్ష్మి, కొట్టు విశాల్, బొడ్డు సాయి, గుండుమోగుల బలుసులు, కొలుకులూరి ధర్మరాజు, బొడ్డు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పారదర్శకంగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జిల్లాలో నూరుశాతం స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీనే తమ ప్రధాన ఉద్దేశ్యమని, ఇందుకు రాజకీయ పక్షాల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ 15 నుంచి ఫారం–6, 7, 8 ద్వారా 1,25,111 దరఖాస్తులు స్వీకరించామన్నారు. వీటిలో 55,535 దరఖాస్తులు పరిశీలన పూర్తై అప్‌డేట్ చేశామన్నారు. మిగిలిన దరఖాస్తుల పరిశీలన వేగంగా జరుగుతుందని మరో వారంరోజుల్లో పూర్తవుతుందన్నారు. ఈ లోపు మార్పులు చేర్పులకు సంబంధించి జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు వెంటనే తెలియజేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల పునర్విభజనకు సంబంధించి ఈ నెల 22లోగా ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపాలని, ఇందు కోసం ఈ నెల 15 నుంచి 18 లోపు నియోజకవర్గాల స్థాయిలో రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని ఈఆర్‌ఓలను ఆదేశించామన్నారు. ఈ నెల 20న రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రతిపాదనలపై సమీక్షిస్తామన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో 1200 దాటి ఓటర్లు ఉంటే మరో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. పోలింగ్ స్టేషన్ల పునర్విభజనకు సంబంధించి ప్రతిపాదనలు, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు విషయంలో కూడా సమగ్ర పరిశీలన చేసి తెలియజేస్తే తప్పులుంటే ఇప్పుడే సరిచేసుకునే వీలుంటుందన్నారు. ఇన్‌ఛార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి సూర్యనారాయణరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు కలవకొల్లు సాంబ (వైఎస్సార్‌సీపీ), నెరుసు నెలరాజు (బీజేపీ), శిర్రా భరత్‌రావు(బీఎస్పీ), రాజనాల రామ్మోహనరావు, ఎస్.బి.ప్రసాద్(కాంగ్రెస్), పాలి ప్రసాద్ (టీడీపీ), ఎం. దశరథకుమార్ (ఆమ్ ఆద్మీ) తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు

జగనన్న సురక్షపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ వినియోగించుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరగనున్న ప్రాంతంలో ముందురోజే ఆ ప్రాంతంలోని ప్రజలందరికి ఈ కార్యక్రమం గురించి తెలిసేలా, వారు ఆరోగ్య సురక్ష కార్యక్రమం వినియోగించుకునేలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ విషయంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆ ప్రాంతంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏ తేదీన, ఏ ప్రదేశంలో నిర్వహిస్తున్నారో తెలియజేయాలని, అందుకు సంబంధించిన కరపత్రాలను అందేలా చూడాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ చెప్పారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.శర్మిష్ఠ, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణ రెడ్డి, ఏలూరు ఆర్డీఓ ఎన్.ఎస్.కె.ఖాజావలి, డీఐవో డా.నాగేశ్వరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల, కోటదిబ్బ వద్ద, ఏలూరు
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 9912440768

క్లుప్తంగా

'ప్రత్యేక ఆహ్వానితుల'కు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందజేసిన ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్రంలోని వివిధ ప్రముఖ దేవస్థానాలకు ట్రస్ట్ బోర్డు ప్రత్యేక అహ్వానితులుగా నియమితులైన పలువురికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం నియామక పత్రాలను అందజేశారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక అహ్వానితులుగా పట్టణానికి చెందిన చెన్నా జనార్దనరావు, మర్నీడి రాఘవరాగిణి, పడమర విప్పర్రుకు చెందిన కోసూరి వెంకటరాజు నియమితులయ్యారు. ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా కొట్టు వెంకటేశ్వరరావు, తాతా శ్రీనివాసరావు నియమితులయ్యారు. అన్నవవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా నల్లిమిల్లి గాంధీరెడ్డి, గుండుమోగుల బలుసులరావు నియమితులయ్యారు. వీరికి మంత్రి నియామకపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

అనురాధకు ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు



అనురాధను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పల అనురాధకు బెస్ట్ ఎడ్యుకేషన్ కౌన్సిలర్‌గా 'ఎడ్యుకేషన్ ఐకాన్' అవార్డు దక్కింది. విద్యారంగంలో విశిష్టమైన సేవలు అందిస్తున్నందుకుగాను ఢిల్లీ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు–2023ను ఆమెకు ప్రకటించినట్లు కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో అనురాధను అభినందించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ గోదావరి రీజినల్ మేనేజర్ ఆర్.నాగేంద్రబాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, ఏవో బోనం సురేష్ పాల్గొన్నారు.



ప్రగతి సాధకులు.. ఇంజనీర్లు



● సమాజ నిర్మాణంలో వారే కీలకం ● నేడు జాతీయ ఇంజనీర్ల దినోత్సవం

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : సమాజ పురోభివృద్ధిలో, ప్రపంచ మానవాళి ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర కీలకం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి అందిస్తూ ప్రపంచ పురోభివృద్ధిలో వారు విశేష పాత్ర పోషిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో భూములను సారవంతం చేయడం నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మనిషి దాదాపు అన్ని సౌకర్యాలూ ఇంటినుంచే పొందగలిగేలా అవకాశాలు కల్పించడంలో ఇంజనీర్ల పాత్ర వెలకట్టలేనిది. కృత్రిమ మేధ (ఏఐ) వంటి సాంకేతికత అభివృద్ధిలో ఇంజనీర్ల కృషి ఎనలేనిది.

'సర్'కు.. నివాళిగా..

భారతదేశంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళిగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డే జరుపుకుంటారు. భారతదేశపు మొట్టమొదటి సివిల్ ఇంజనీర్లలో విశ్వేశ్వరయ్య ఒకరు. ఆయన్ని 1955లో భారతరత్న పురస్కారంతో గౌరవించారు. జాతీయ ఇంజనీర్స్ డే అనేది సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను గౌరవించడంతో పాటు ఇతర ఇంజనీర్లను కూడా గుర్తించేరోజు. దేశంలో తొలిసారిగా 1968లో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. నేషనల్ ఇంజనీర్స్ డే 2023 థీమ్ 'సుస్థిర భవిష్యత్తు కోసం ఇంజనీరింగ్'గా నిర్ణయించారు.

రైతుల కలలు సాకారం చేసేలా..

కాటన్ నిర్మించిన ధవళేశ్వరం బ్యారేజీ ఒక ఇంజినీరింగ్ అద్భుతం కాగా.. దాని నిర్మాణం ద్వారా తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని లక్షలాది ఎకరాలు సారవంతమయ్యాయి. మెట్ట, ఏజెన్సీ భూములను సైతం సస్యశ్యామలం చేయాలనే ఆలోచనతో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పోలవరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. దీని ద్వారా ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లాలోని మెట్ట ప్రాంత భూములను సైతం సుభిక్షం చేసే దిశగా ఆయన అడుగులు వేశారు. నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతులమీదుగా అది సాకారమయ్యే దిశగా ముందుకు సాగుతోంది. త్వరలోనే ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసుకొని ప్రజలకు అంకితమయ్యేందుకు సిద్ధమవుతోంది.

ఆదర్శప్రాయులు వీణం వీరన్న

సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాలుగేళ్ల పాటు ఆయన వెన్నంటి ఉన్న వీణం వీరన్న నేటి ఇంజనీర్లకు ఆదర్శప్రాయులు. ఇంజనీరింగ్ బాధ్యతలను కాటన్ వెన్నంటి ఉండి వీరన్న నెరవేర్చి కాటన్ అంత ఖ్యాతిని పొందారు. ఆయన ఇంజనీరింగ్ సేవలను కొనియాడుతూ పెంటపాడులో ఒక ఆడిటోరియం నిర్మించడంతో పాటు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఇంజనీర్ల పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

ఇంజనీరింగ్ విద్యకు మణిహారంగా ఉమ్మడి పశ్చిమగోదావరి



ఏపీ నిట్ భవనాలు



నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని అకడమిక్ భవనం

ఇంజనీరింగ్ విద్యలో మణిహారంగా నిలిచే జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ కళాశాలలు పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొలువై ఉండటం విశేషం. వాటిలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ఒకటి కాగా, మరొకటి ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్ ఐటీ. రాష్ట్రానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసే నిట్ కాలేజీ తాడేపల్లిగూడెంలో కొలువై ఉండటం విశేషం. జేఈఈలో ర్యాంకు సాధించడం ద్వారా ఇక్కడ సీటు పొందగలుగుతారు. దాదాపు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థులూ ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత జాతీయ విద్యా సంస్థలను కేటాయించే క్రమంలో తాడేపల్లిగూడెం పట్టణానికి నిట్‌ను కేంద్రం మంజూరు చేయగా, అనతికాలంలోనే ఉద్యోగాల కల్పనలో ప్రఖ్యాతిగాంచిన తిరుచ్చి నిట్ తర్వాతి స్థానంలో ఈ కళాశాల నిలిచింది. 2020–21 సంవత్సరంలో దక్షిణ భారతదేశంలో ఉన్నత విద్యాసంస్థగా ఏపీ నిట్ నిలిచింది. జాతీయస్థాయిలో సామర్థ్యం కలిగిన విద్యార్థులను ఇంజనీర్లుగా తీర్చిదిద్దడంలో ఈ విద్యాసంస్థ విశేష కృషి చేస్తోంది.

ఆరేళ్ల విద్య.. పూర్తి ఉచితంగా..

ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్‌ఐటీ ఇంజినీరింగ్ విద్యలో మణిహారంగా నిలుస్తోంది. ఇక్కడ ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 2008లో దీనిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం పూర్తిగా ఉచిత విద్యను అందజేస్తోంది. ఇందులో మొదటి రెండేళ్లు ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ), తరువాత నాలుగేళ్లు ఇంజనీరింగ్ విద్యను విద్యార్థులు అభ్యసిస్తారు. ఏటా 1100 మంది విద్యార్థులు ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని బయటికి వెళుతున్నారు.

సమాజ పురోగతికి ఇంజనీర్లు దోహదం



సమాజ పురోగతికి ఇంజనీర్లు దోహదం చేస్తున్నారు. భావి ఇంజనీర్లు సమాజ ప్రగతికి తమవంతు పాత్ర పోషించాలి. దేశ సమగ్ర అభివృద్ధికి కృషిచేయాలి.

– డాక్టర్ పి.దినేష్ శంకరరెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ఏపీ నిట్

ఆధునిక అంశాలను అన్వేషించాలి



భావి ఇంజనీర్లు నచ్చిన ఇంజనీరింగ్ విభాగంలో ఆధునిక అంశాలను అన్వేషించాలి. దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలి. ప్రస్తుత ఇంజనీరింగ్‌లో ఆధునిక కోర్సులైన కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటివి అద్భుతాలు సృష్టిస్తున్నాయి. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధాన ప్రక్రియకు పరస్పర ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం వారధిగా నిలవాలి.

– డాక్టర్ వి.సందీప్, ఈఈఈ విభాగాధిపతి, ఏపీ నిట్

దేశాభివృద్ధిలో ఇంజనీరింగ్ విద్యే కీలకం



దేశాభివృద్ధిలో ఇంజనీరింగ్ విద్య అత్యంత కీలకం. రహదారులు, వంతెనలు, బహుళ అంతస్తుల భవనాలు తదితర నిర్మాణాల్లో సివిల్ ఇంజనీరింగ్ పాత్ర ప్రధానం. మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశం గర్వించే గొప్ప ఇంజనీర్. దేశానికి సివిల్ ఇంజనీర్ల అవసరం ఎంతో ఉంది.

– ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, డైరెక్టర్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ

జెడ్పీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా స్టాన్లీ బాబు



ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్‌గా వెంపటి స్టాన్లీ బాబు నియమితులయ్యారు. ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఈ మేరకు గురువారం ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. నగరంలోని విద్యానగర్‌కు చెందిన స్టాన్లీ బాబు 30 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. సీనియర్ న్యాయవాదిగా తాను చేసిన సేవలకు గుర్తింపుగా జెడ్పీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్‌లోని అంశాలలో న్యాయపరమైన వివాదాల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. నగర డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ఏపీపీలు ఆచంట వెంకటేశ్వరరావు, డీవీ రామాంజనేయులు, సీహెచ్ రాజేంద్రప్రసాద్, పలువురు న్యాయవాదులు స్టాన్లీ బాబుకు అభినందనలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నూజివీడు: పట్టణంలోని శిలువ గట్టు సమీపంలోని గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లయ్స్ అధికారులు పట్టివేశారు. పట్టణానికి చెందిన చిన్ని శ్రీనివాస్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలించేందుకు అక్రమంగా నిల్వ ఉంచగా, అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏలూరు సీఐ విల్సన్, సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ జీ వెంకటేశ్వరరావు, వీఆర్వో పీ రాజబాబు బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో గోడౌన్‌పై దాడి చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తెల్లసంచుల్లో నిల్వ ఉంచిన ఈ రేషన్ బియ్యం బస్తాలను లెక్కించగా ఆరు టన్నులుగా తేలింది. వీటిని గోడౌన్ నుంచి తరలించి రేషన్ డీలర్ కస్టోడియన్‌లో ఉంచారు. ఈ ఘటనలో శ్రీనివాస్‌పై 6(ఏ) కేసు నమోదు చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యాదవ మహాసభ జాతీయ సదస్సుకు తరలిరండి



సదస్సు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : తిరుపతిలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్న అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ సదస్సుకు తరలిరావాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉక్కుసూరి గోపాలకృష్ణ కోరారు. అమీనాపేట ఏటిగట్టులోని సంఘ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సదస్సుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని యాదవుల రాజకీయ భవిష్యత్తు కార్యాచరణపై సదస్సులో చర్చిస్తారన్నారు. 16న యాదవ ప్రతినిధుల సభ, 17న వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న యాదవ ప్రముఖులతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, అయోధ్యలోని రామ జన్మభూమి వివాదం పరిష్కరించిన తరహాలో మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి వివాదాన్ని పరిష్కరించి కృష్ణ మందిరాన్ని నిర్మించాలని కోరారు. యాదవుల సామాజిక ఆర్థిక, విద్య, ఉద్యోగ ప్రగతి కోసం రాజస్థాన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి మండళ్లు ఏర్పాటు చేయాని, భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్‌ను పునరుద్ధరించాలని, జాతీయ జనగణనలో కులగణన వెంటనే చేపట్టాలని కోరారు. తిరుమల తిరుపతిలో యాదవ వసతి గృహాన్ని నిర్మించాలని, టీటీడీ పాలకమండలిలో యాదవులకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని, తిరుమల–తిరుపతి కూడలిలో శ్రీవారి ఆలయం నిర్మించిన యాదవ రాజుల జ్ఞాపకార్థం వారి శిలావిగ్రహాలను ప్రతిష్ఠించి, వారి చరిత్ర మ్యూజియంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసారు. యాదవ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారపు బుజ్జి, కోశాధికారి గొర్ల రామారావు, నగర అధ్యక్షులు బొట్టా అజయ్, కోశాధికారి భోగా రాజేష్, రాష్ట్ర యువజన కార్యదర్శి మల్లిపూడి రాజు, నాయకులు చిట్టిబోయిన సాయిబాబు, కట్టా ఏసుబాబు, వుల్లగోర చిరంజీవి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బైక్‌లపైకి దూసుకెళ్లిన కారు

● పెయింటర్ మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
● తణుకు హైవేపై శర్మిష్ట సెంటర్ వద్ద ఘటన



చదలవాడ ప్రేమ్‌కుమార్ మృతదేహం



తణుకు హైవే వద్ద ప్రమాదం దృశ్యం

తణుకు: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి మోటారు సైకిళ్లపైకి దూసుకెళ్లిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక శర్మిష్ట సెంటర్‌లో గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రమాదం సమయంలో కారును మహిళ నడుపుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన చదలవాడ ప్రేమ్‌కుమార్ (24), ఆకుల బుల్లబ్బాయి, మార్లపూడి రాజు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం వీరు మోటారు సైకిల్‌పై పెయింటింగ్ పనులు నిమిత్తం తణుకు బయలుదేరారు. స్థానిక శర్మిష్ట సెంటర్ వద్దకు వచ్చేసరికి రోడ్డు దాటుతున్న వీరి మోటారు సైకిల్‌ను విజయవాడ నుంచి రాజోలు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఇదే సమయంలో మరో మోపెడ్‌పై రోడ్డు దాటుతున్న ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణరెడ్డిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చదలవాడ ప్రేమ్‌కుమార్ సంఘటనా స్థలంలోనే మృతి చెందిగా ఆకుల బుల్లబ్బాయి, కర్రి సత్యనారాయణరెడ్డి తీవ్రంగా గాయపడగా మార్లపూడి రాజుకు స్వల్పగాయాలయ్యాయి. బుల్లబ్బాయి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన విజయవాడకు చెందిన వర్తినీడి స్వాతిసుబ్బలక్ష్మిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● గడపగడపకు సంక్షేమం



టి.నరసాపురం: తెడ్లంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా కేథరిన్

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓగా డాక్టర్ మేరీ కేథరిన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లాలోని మండవల్లి పీహెచ్‌సీలో సీనియర్ వైద్యురాలిగా పనిచేస్తున్న ఆమె కేఆర్‌పురం ఐటీడీఏ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓగా పదోన్నతిపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన మేరీ కేథరిన్, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. అదేవిధంగా పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కూడా ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము

ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి), ఏలూరు జిల్లా-534426, ఫోన్: 08829 - 271427
Website: www.dwarakatirumala.org, e-mail: endow-eodtiru-ap

File No.REV65/23/2023-SUPDT(C2)

ఇ-ప్రొక్యూర్‌మెంట్/సీల్డ్ టెండర్/బహిరంగ వేలము ప్రకటన

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము, ద్వారకాతిరుమల, ఏలూరు జిల్లా, లీజెస్ విభాగము-శ్రీ స్వామి వారికి చెందిన ఈ దిగువ పట్టికలో తెల్పిన వ.నెం.1 నుండి వ.నెం.5 వరకు గల ఐటమ్స్ కు ది:25-09-2023 న శ్రీ స్వామివారి పాదుకా మండపము వద్ద ఉ.గం.11.00ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ (సీల్డ్ టెండర్/బహిరంగ వేలము మరియు వ.నెం.6, వ.నెం.7 నకు బహిరంగవేలము సంబందిత దేవాలయముల వద్ద నిర్వహించబడునని తెలియజేయడమైనది.

వ.నెం.	లైసెన్సు వివరములు	కాలపరిమితి	ప్రథమ ధరావత్తు	బహిరంగ వేలము తేది
1	తూర్పు వైపు షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెం.12, 13, 14 & 18 ల నందు ఫ్యాన్సీ మరియు జనరల్స్ వస్తువులకు విక్రయించుకొను హక్కు	అప్పగించిన తేది నుండి 2 సం.	రూ.3,00,000/- షాపు ఒక్కింటికి	25-09-2023
2	టి.టి.డి షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెం.3 & 6 నందు వ్యాపారములు చేసుకొను లైసెన్సు హక్కు	అప్పగించిన తేది నుండి 3 సం.	రూ.25,000/- షాపు ఒక్కింటికి	25-09-2023
3	అల్వార్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెం.1, 4 & 6 నందు వ్యాపారము చేసుకొను లైసెన్సు హక్కునకు.		రూ.25,000/- షాపు ఒక్కింటికి	25-09-2023
4	పద్మరాజా భవనం నందలి షాపు నెం.1 నందు వ్యాపారము చేసుకొను లైసెన్సు హక్కునకు		రూ.25,000/-	25-09-2023
5	శ్రీ స్వామి వారి దూపక దేవాలయమైన భీమడోలు నందు ద్వారకాతిరుమల వైపుషాపు నెం.6 నందు వ్యాపారములు చేసుకొను లైసెన్సు హక్కునకు.		రూ.25,000/-	25-09-2023
6	శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానమునకు దత్తత దేవాలయమైన రంగాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భూనీళా సహిత సత్యనారాయణ స్వామి వారి ఆలయం వద్ద గల షాపు నందు కొబ్బరి కాయలు మరియు పూజా ద్రవ్యములు అమ్ముకొనుట, కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకొను మరియు దేవాలయ ప్రాంగణంలో గల సుమారు 15 కొబ్బరి చెట్ల ఫలసాయం పొందు హక్కునకు.	అప్పగించిన తేది నుండి రెండు సంవత్సరముల కాలమునకు	రూ.25,000/-	22-09-2023
7	శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానమునకు దత్తత దేవాలయమైన ఏలూరు నందు దూర్పు వీధిలో వేంచేసియున్న శ్రీ సంతాన వేణు గోపాల స్వామి వారి ఆలయం వద్ద గల షాపు నెం.1 నందు వ్యాపారం చేసుకొను హక్కునకు.		రూ.25,000/-	27-09-2023

1. ఆసక్తి గల పాటదారులు ధరావతుతో పాటుగా ఆధార్ కార్డు సమర్పించి మాత్రమే బహిరంగ వేలములో పాల్గొనవలెను. 2. వ.నెం. 1 నుండి వ.నెం. 5 వరకు టెండర్ షెడ్యూల్ జారి చేయు ప్రారంభ తేది:17-09-2023 నుండి ముగింపు తేది:24-09-2023 వరకు. 3. టెండర్ షెడ్యూల్ బాక్స్ నందు వేయు తేది:25-09-2023 ఉ.గం. 10.00 నుండి గం.11.00 వరకు. 4. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నందు పాల్గొను వారు ది:17-09-2023 నుండి www.apeprocurement.gov.in లాగ్ ఇన్ అవ్వవచ్చును. గమనిక: ఇతర వివరముల కొరకు ఈ కార్యాలయము పనిచేయు వేళలలో లీజెస్ విభాగము వారిని సంప్రదించగలరు. ఫోన్: 08829-271427, 8143682822, 9491100058.

సం/- వి. త్రినాథరావు, కార్యనిర్వహణాధికారి

వైద్య విద్యారంగంలో నవశకం



రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం
మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తున్న
ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారికి

స్వాగతం... సుస్వాగతం....

ప్రజల ముంగిటకే నాణ్యమైన ప్రభుత్వ వైద్యం, ఇతర సౌకర్యాల కల్పన అందించి, విద్యార్థులు వైద్య విద్య/నర్సింగ్ తదితర ఉన్నత చదువులకై వేరే ప్రాంతాలకు వెళ్ళి ఇబ్బందులు పడకుండా జిల్లాకు మెడికల్ కాలేజి మరియు వైద్య సౌకర్యాలతో అనుబంధ ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో
రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం మెడికల్ కాలేజీల నిర్మాణం.
ఒక్కొక్క కాలేజీలో 150 మంది ఎంబిబిఎస్ విద్యార్థులు అడ్మిషన్లు పొందేలా నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుండి అనుమతులు. విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, లైబ్రరీలు, ఆడిటోరియం నిర్మాణం.







meil
Megha Engineering and Infrastructures Ltd
Irrigation | Drinking Water | Power Generation | Power Transmission | Roads | Hydrocarbons | Mega Gas
Railways | Buildings | Industrial Infrastructures | Effluent Treatment | Defence Equipment

క్లుప్తంగా

మహిళా వలంటీర్లను వేధించిన వ్యక్తి అరెస్ట్



ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌లో నిందితుడు

ఏలూరు టౌన్: నగరంలోని పలువురు మహిళా వలంటీర్లకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ వేధింపులకు గురిచేస్తున్న ఓ వ్యక్తిని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ గురువారం అదుపులోకి తీసుకున్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన దమ్మర్ల నరసింహులు అనే వ్యక్తిని అరెస్టు చేసి ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడు నరసింహులుకు వివాహం కాగా భార్య అతడ్ని వదిలేసింది. తమ గ్రామంలో వలంటీర్లు చేస్తున్న సర్వేలు, ఇతర వివరాలు తెలుసుకుని, వాటి ఆధారంగా ఏలూరు నగరంలోని కొందరు మహిళా వలంటీర్లకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ వేధించాడు. దీనిపై మహిళా వలంటీర్లు ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ రామకృష్ణ నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, విచారణ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేస్ బాల్ జిల్లా పోటీలకు ఎంపిక



భాను ప్రకాష్

కొయ్యలగూడెం: బేస్ బాల్ జిల్లా జట్టుకు వెంకటపతి రాజు విద్యా సంస్థలకు చెందిన తమ విద్యార్థి ఎంపిక అయినట్లు కరస్పాండెంట్ ఎస్ఆర్ఆర్ సుభద్ర దేవి గురువారం తెలిపారు. పెదవేగి జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–19 బేస్‌బాల్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన కొత్తపల్లి భానుప్రకాష్‌ను జిల్లా జట్టుకు ఎంపిక చేశారన్నారు. విద్యార్థిని మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహారాజు, ప్రిన్సిపాల్ నారా కేశవరావు, అభినందించారు.

జిల్లా స్కూల్ గేమ్స్‌కు ఎంఏకేఏ విద్యార్థులు



ఎంపికైన ఎంఏకేఏ స్కూల్ విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు మండల స్థాయి స్కూల్‌గేమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ఆర్ఎం చౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు అండర్–14 బాలురు, బాలికలు, అండర్–17 బాలురు, బాలికల క్రీడలకు సంబంధించిన కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ జట్లకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు టీ.శ్రీనివాస్ కుమార్‌లను చౌదరి, పీఎంసీ కమిటీ చైర్మన్ ఎస్‌కే యాస్మిన్ ప్రత్యేకంగా అభినందించారు.

పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని వినతి



సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జీవో సంఘం నాయకులు

ఏలూరు (మెట్రో): పెండింగ్ బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని రాష్ట్ర ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, కేవీ శివారెడ్డి రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ కేవీ సత్యనారాయణను కోరారు. ఈ మేరకు మంగళగిరిలో వారు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఇంకా 10 శాతం పెన్షన్లు పడలేదని, సదరు పెన్షన్‌దారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్‌లు, జీపీఎఫ్‌లు, మెడికల్ బిల్స్ రావడంలేదన్నారు. మిగిలిపోయిన పెన్షన్‌లు, పెండింగ్ బిల్స్ వెంటనే క్లియర్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ సెక్రటరీ స్పందిస్తూ ఇంకా కేవలం 196 మందికి మాత్రమే పెన్షన్‌లు పడలేదని, శుక్రవారం అవి కూడా క్లియర్ అవుతాయని తెలిపారని నాయకులు పేర్కొన్నారు. అలాగే పెండింగ్ బిల్లులకు సంబంధించి త్వరలో క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏపీఎన్జీవోస్ నాయకులు పాల్గొన్నారు.

చండీహోమం

భీమవరం (ప్రకాశంచౌక్): అమావాస్య సందర్భంగా గురువారం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో చండీహోమం నిర్వహించారు. 61 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారని ఆలయ ప్రధానర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ తెలిపారు. ఆలయ ఈఓ వై.భద్రాజీ ధర్మకర్తలు ముత్యాల రామారావు, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, మావూరి సుందరరావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య సురక్ష

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందాలి. గిరిజన ప్రాంతాల్లో అటవీ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు కూడా మంచి వైద్య సౌకర్యాలు అందించడంతో పాటు ఇకపై పూర్తి స్థాయిలో ఆరోగ్య స్థితిగతులు పర్యవేక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను రూపొందించింది. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో జిల్లాలోని ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించి, ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇవ్వనుంది. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో చేర్చి చికిత్స అందించి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లే వరకు పూర్తి స్థాయిలో పర్యవేక్షించేలా సమగ్ర కార్యాచరణతో ఈ పథకాన్ని అమలు చేయనుంది.





- 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు
- జిల్లాలోని 477 గ్రామాల్లో 477 వైద్య శిబిరాలు
- శిబిరాల్లో పరీక్షలు, మందుల కౌంటర్ ఏర్పాటు
- అందుబాటులో 168 మంది వైద్య నిపుణులు
- నేటి నుంచి వలంటీర్లు, ప్రజాప్రతినిధుల క్యాంపెయిన్
- ఇప్పటికే ప్రారంభమైన డోర్ టు డోర్ సర్వే

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లాలో ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లాలోని 477 చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు, మెడికల్ ఆఫీసర్, ఇతర సిబ్బందికి గురువారం నుంచి ప్రత్యేక శిక్షణ శిబిరాలను కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించారు. అలాగే గురువారం నుంచి డోర్ టూ డోర్ సర్వేకు శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామంలో ఉన్న వలంటీర్లు, గృహసారథులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యసిబ్బంది హెల్త్ క్యాంపు నిర్వహించే తేదీని అందుబాటులో ఉండే వైద్యులు, అక్కడ చేసే పరీక్షలు ఇలా అన్నింటికి సంబంధించి పూర్తి వివరాలు ప్రతి ఇంటికి వివరిస్తున్నారు. రెండో దశలో ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు, సచివాలయంలో మ్యాపింగ్ డేటాను తీసుకుని దాన్ని రెండుగా విభజించి ప్రతి ఇంటికి వెళ్లి వారికి అవసరమైన వైద్య వివరాలను తెలుసుకుని, అలాగే కుటుంబ ఆరోగ్య స్థితిగతులు, అవసరమైన వైద్యపరీక్షలు వివరాలను నమోదు చేసుకుని ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళిని పూర్తి చేసి ఆరోగ్యశ్రీ, సిటిజన్ యాప్ గురించి వివరించి వారితో డౌన్‌లోడ్ చేయించనున్నారు. మూడో దశలో వైద్యశిబిరం నిర్వహించడానికి మూడు రోజులు ముందు కరపత్రాల ద్వారా ఇంటింటికి ప్రచారం చేసి సచివాలయం పరిధిలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో అంత మంది వైద్య శిబిరాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు రిజిస్ట్రేషన్ టోకెన్లను జనరేట్ చేసి అందజేయనున్నారు. టోకెన్ ఆధారంగా వైద్యశిబిరంలో హెల్త్ డెస్క్‌లో సంప్రదిస్తే నేరుగా అవసరమైన వైద్యుల వద్దకు పంపే ఏర్పాట్లు చేయనున్నారు.

477 వైద్య శిబిరాలు

ఏలూరు జిల్లాలో 477 చోట్ల వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. ప్రతి వైద్యశిబిరంలో ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు ఉంటారు. ప్రతి మెడికల్ క్యాంపులో నాలుగు రూమ్‌లు ఉండేలా చూసి ఈసీజీ, ఎకో, రక్తపరీక్షలతో పాటు అవసరమైన అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి క్యాంపులో హెల్త్ డెస్క్ కౌంటర్, రిజిస్ట్రేషన్ కౌంటర్, డ్రగ్స్ కౌంటర్, టెస్టింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు నడవలేని రోగులకు వీల్ చైర్లను అందుబాటులో ఉంచుతారు. వీటితో పాటు న్యూట్రిషియన్ ఫుడ్ స్టాల్స్‌ను, కళ్లజోళ్లను పంపిణీ చేయడానికి వీలుగా ప్రత్యేక శిబిరాన్ని క్యాంపులో ఏర్పాటు చేస్తున్నారు. వైద్యులు రోగులను పరిశీలించి అవసరమైన మందులు పంపిణీ చేయడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపి డిశ్చార్జి అయ్యేవరకు ఆరోగ్య స్థితిని పర్యవేక్షించనున్నారు. సమగ్ర వ్యాధి నివారణ– ప్రజల సంరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు.

జిల్లా స్థాయిలో కమిటీలు

45 రోజులపాటు జరిగే జగనన్న ఆరోగ్య సురక్షను పకడ్బందీగా అమలు చేయడం కోసం ఏలూరు జిల్లాలో కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.శర్మిష్టా, జెడ్పీ సీఈఓ కేవీఎస్ఆర్ రవికుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ జీ.రమణకు విధులు కేటాయించారు. అలాగే డివిజన్లవారీగా మోనిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఏలూరు డివిజన్‌కు ఆర్డీఓ ఖాజావలీ, డీఐఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ చంద్రశేఖర్, నూజివీడు డివిజన్‌కు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వీ.ఆశ, డీఎల్‌పీఓ సుందరి, జంగారెడ్డిగూడెం డివిజన్‌కు ఆర్‌డీఓ ఝాన్సీరాణి, పీఓ కే.నరేంద్రకృష్ణ, డీఎల్‌డీఓ ఎం.రాజు, ఐటీడీఏ ప్రాంతానికి ఐటీడీఏ పీఓ సూర్యతేజ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మేరి, డీఎల్‌పీఓ ఎండీ రాజాలను నియమించారు. మోనటిరింగ్ కమిటీలు, ట్రైనింగ్ క్యాంపుల వరకు పర్యవేక్షించనున్నారు.



ఏలూరులో ఆరోగ్య సురక్ష బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

యాక్షన్ ప్లాన్ ఇలా..

మండలాలు	28
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	63
అర్బన్ ప్రాంతాల్లో పీహెచ్‌సీలు	14
గ్రామ సచివాలయాలు	517
వార్డు సచివాలయాలు	88
వైద్యశిబిరాల సంఖ్య	477
104 వాహనాలు	41
వైద్యుల కేటాయింపు	
గైనకాలజిస్టులు	10
చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు	16
జనరల్ మెడిసిన్	18
ఇతర వ్యాధుల నిపుణులు	124
మొత్తం	168

ప్రతిష్టాత్మకంగా అమలు



గిరిజన ప్రాంతాలతో సహా అన్ని గ్రామాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించి పూర్తి ఆరోగ్య భద్రత కల్పించడంతో పాటు అవసరమైన మందులు పంపిణీ చేసి దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందిపడేవారికి వైద్యం చేయిస్తాం. ఎంతో ఖర్చు పెట్టుకుని నిష్ణాతులైన వైద్యుల వద్దకు వెళ్లే అవసరం లేకుండా వైద్యులనే గ్రామాల్లోకి తీసుకువచ్చి వైద్యసేవలు అందించేలా నెల రోజుల పాటు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

– వె.ప్రసన్న వెంకటేష్, ఏలూరు జిల్లా కలెక్టర్

ఇంటి పన్ను నిధులు రూ. కోటి స్వాహా

- దెందులూరు టీడీపీ సర్పంచ్, పూర్వ పంచాయతీ కార్యదర్శి నిర్వాకం
- దెందులూరు, మూడు శివారు గ్రామల్లో పన్నుల సొమ్ము దుర్వినియోగం
- టీడీపీ సర్పంచ్ ఏసమ్మ, కార్యదర్శి చెరో రూ.50 లక్షలు ఖాతాలకు మళ్లింపు
- జగనన్నకు చెబుదాంలో గ్రామస్తుడు చిలికి శేఖర్ ఫిర్యాదుతో వెలుగులోకి..



దెందులూరు/ఏలూరు మెట్రో: దెందులూరు, పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల్లో ఇంటి పన్ను రూపంలో వసూలు చేసిన రూ.కోటి నిధులను గ్రామ టీడీపీ సర్పంచ్, పూర్వ పంచాయతీ కార్యదర్శి స్వాహా చేశారు. గ్రామస్తుడు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో చేసిన ఫిర్యాదుతో డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేయగా మోసం బయటపడింది. రూ.కోటి 9 లక్షల 36వేల 44 నిధులు గోల్‌మాల్ అయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ గురువారం అధికారికంగా ధ్రువీకరించి ఈ విషయాన్ని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు నివేదిక అందజేశారు. వివరాల్లోకి వెళితే.. దెందులూరు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని, విచారణ నిర్వహించాలని 'జగనన్నకు చెబుదాం'లో గ్రామానికి చెందిన చిలికి శేఖర్ ఫిర్యాదు చేశారు. దీనిపై డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన విచారణ చేసి దెందులూరు, సత్యనారాయణపురం, అలుగులగూడెం, అప్పారావుపాలెం గ్రామాల్లో ఇంటి పన్ను రూపంలో వసూలు చేసిన సుమారు రూ.ఒక కోటి 9లక్షల 36వేల 44 నిధులు దుర్వినియోగం అయ్యాయని అధికారికంగా తేల్చారు. నగదును ప్రభుత్వ ఖజానాకు జమచేయకుండా తెలుగుదేశం పార్టీ గ్రామ సర్పంచ్ తోట ఏసమ్మ, దెందులూరు పూర్వ పంచాయతీ కార్యదర్శి జీ.యోహోషువా తమ బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసినట్లు గుర్తించి నిర్ధారించారు. విచారణలో సర్పంచ్ ఏసమ్మ రూ.50 లక్షల 2 వేల054, కార్యదర్శి యోహోషువా రూ.59 లక్షల 33 వేల 990 నిధులు దుర్వినియోగం చేశారని విచారణలో తేలింది. నిధులు దుర్వినియోగం చేసి అవినీతికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్ విశ్వనాథ్ చెప్పారు.

తూతూమంత్రంగా విచారణ

దెందులూరుతో పాటు మరో మూడు శివారు పంచాయతీ గ్రామాల్లో ప్రజల నుంచి ఇంటి పన్ను వసూలు చేస్తున్నా ప్రభుత్వ ఖజానాకు జమ కాకపోవడంలో అధికారుల తీరుపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. పన్నుల సొమ్ము ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ కాకుండా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు మళ్లినా అధికారులు పట్టించుకోకపోవడాన్ని తప్పుబడుతున్నారు. దెందులూరు గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగిన నాటి నుంచి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే వరకు నిధులు జమపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఈ వ్యవహారానికి తెరతీసిందని అంటున్నారు. విచారణలో సైతం వాస్తవాలు బయటకు రాకూడదని, జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేసినప్పటికీ విచారణాధికారులు మూడో కంటికి తెలియకుండా రోజుల వ్యవధిలోనే విచారణ ముగించడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామస్తుడు చిలికి శేఖర్ వదిలిపెట్టకుండా మళ్లీ ఫిర్యాదు చేయడంతో అధికారులు మొక్కుబడిగా తూతూమంత్రంగా సిబ్బంది లేరు, రికార్డులు ఇవ్వలేదు, వరదలొచ్చాయి, సెలవులు అంటూ కాకమ్మ కబుర్లు చెప్పి కాలయాపన చేసి విచారణను నీరుకార్చే ప్రయత్నం చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

స్పీడ్ ట్రైల్ కేసులపై ప్రత్యేక దృష్టి

ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి



ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా నూజివీడు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో స్పీడ్ ట్రైల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సాక్షులను కోర్టులో హాజరుపరిచి నిందితులకు శిక్షలు పడేలా చొరవ చూపాలని ఏలూరు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు పోలీసు ప్రధాన కార్యాలయంలో నూజివీడు పోలీస్ సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో ఎస్పీ గురువారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. నూజివీడు సర్కిల్, టౌన్, రూరల్ సర్కిల్, పెదవేగి సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులపై జిల్లా ఎస్పీ ఆరా తీశారు. ఆయా కేసుల దర్యాప్తు, చార్జిషీట్, నిందితుల అరెస్టులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సారా, అక్రమ మద్యం రవాణా, విక్రయాలు నిరోధించేలా తరచు వాహన తనిఖీలు చేపట్టాలని తెలిపారు. మాదక ద్రవ్యాలు నివారణకు కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. చోరీలకు చెక్ పెట్టేందుకు పగలు, రాత్రి గస్తీ మరింత విస్తృతం చేయాలన్నారు. ప్రతి రోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ నేరస్తుల కదిలికలపై నిఘా ఉంచాలన్నారు. పోలీస్‌స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, నిత్యం వారి కదలికలను పరిశీలించాలని తెలిపారు. సిబ్బంది ఎవరైనా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, ఎస్‌బీ సీఐ యం.సుబ్బారావు, డీసీఆర్‌బీ సీఐ దుర్గాప్రసాద్, నూజివీడు టౌన్ సీఐ మూర్తి, రూరల్ సీఐ ఆర్.అంకబాబు, నూజివీడు టౌన్, రూరల్, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, పెదపాడు, పెదవేగి, దెందులూరు ఎస్ఐలు హాజరయ్యారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్ ఆవిష్కరణ
- ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ మెరుగైన, నాణ్యమైన వైద్యచికిత్సలే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తోందని, ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని చెప్పారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి, వాటి చికిత్స, వైద్యానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించే దిశగా ఈనెల 15 నుంచి చేపట్టే జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే బ్రోచర్‌ను గురువారం ఎమ్మెల్యే నాని ఆవిష్కరించారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాద్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే నాని బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలను గుర్తిస్తారని తెలిపారు. ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. ప్రతి మెడికల్ క్యాంపులోనూ నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారని, ఐదు దశల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులకు సైతం పరీక్షలు చేసి, చికిత్సలు అందిస్తారని ఎమ్మెల్యే నాని స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఏనాడు ప్రభుత్వం ఈ విధంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పెద్దెత్తున కార్యక్రమాలు చేపట్టలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఉన్నారు.

మామిడిలో సస్యరక్షణకు తరుణమిదే

- ఇప్పటినుంచే దుక్కులు దున్ని ఎరువులు వేసుకోవాలి
- తోటల పునరుద్ధరణ చర్యలపై రైతులకు అవగాహన



చింతలపూడిలో మామిడి తోట, ఎ.దుర్గేష్, అసిస్టెంట్ డైరెక్టర్, ఉద్యాన శాఖ (అంతరచిత్రం)



చింతలపూడి: మామిడి తోటలు సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో పూతకు వస్తాయి. ఈ దశలో మామిడి రైతులు ఇప్పటినుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఒక పక్క మామిడి తోటల పునరుద్ధరణపై దృష్టి సారిస్తూనే మరో పక్క సస్యరక్షణపై ఉద్యాన అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం, ద్వారకాతిరుమల, నల్లజర్ల, టి.నరసాపురం ప్రాంతాల్లో సుమారు 60 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మామిడి తోటల పునరుద్ధరణకు, అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టి రైతులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. ప్రతి ఏటా నాణ్యమైన పంట దిగుబడిని గణనీయంగా పెంచడానికి ఉద్యాన శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.దుర్గేష్ తెలియజేస్తున్నారు. పూత రావడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు సూచిస్తున్నారు.

సెప్టెంబర్‌కు ముందే దుక్కులు

మామిడి రైతులు సెప్టెంబర్‌కు ముందే తోటల్లో దుక్కులు దున్నుకోవాలి. చెట్లకు కావలసిన ఎరువులను వేసుకోవాలి. అక్టోబర్ తరువాత మామిడి తోటలను దున్నకూడదు. ఈ దశలో దున్నితే చెట్ల వేర్లు కదిలి పోషక పదార్థాల సమతుల్యత దెబ్బతింటుంది. సాధారణంగా మామిడిలో పూత ఒకేసారి రాదు. ఫిబ్రవరి నెలాఖరు వరకు పూత వస్తూనే ఉంటుంది. ఆ సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం సరికాదు. ఈ సమస్యను అధిగమించేందుకు తేమ తక్కువ ఉండే నేలల్లో తేలిక పాటి నీటి తడులు ఇవ్వాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తోటల్లో సూక్ష్మ పోషకలోపాలను నివారించడానికి లీటరు నీటికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 3 గ్రాముల బోరాక్స్, 5 గ్రాముల ఫెర్రిక్ సల్ఫేట్, 10 గ్రాముల యూరియా కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వర్షం పడితే రసం పీల్చే పురుగులు చేరే అవకాశం ఉండటం కారణంగా తోటల్లో కలుపు లేకుండా చూసుకోవాలి. తోటల్లో పూత, మొగ్గలు ప్రారంభమైన తరువాత మొగ్గలు విచ్చుకుని పూత రావడానికి 2 గ్రాముల బోరాన్ లేదా, 10 గ్రాముల మల్టీ-కేతో పాటు 5 గ్రాముల ఫార్ములా–4 మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తేనె మంచు పురుగు నివారణ

తేనె మంచు పురుగులు తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులను, పూత కాండాలను, లేత పిందెల నుంచి రసం పీల్చి నష్టం చేస్తాయి. దీని వల్ల ఆకుల చివర్లు మాడిపోతాయి. పూత మాడిపోతుంది. పిందెలు బలహీన పడి రాలిపోతాయి. అంతే కాకుండా ఈ పురుగులు విసర్జించే పదార్థం వల్ల ఆకులు, కాయలపై మసి పొర ఏర్పడుతుంది. పూత, పిందె దశలో ఈ పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. మిగతా సమయాల్లో ఈ పురుగులు చెట్టు మొదలు, కొమ్మల బెరడుల్లోని పగుళ్లలో ఉంటాయి.


నివారణ ఇలా..

వీటి నివారణకు 1.5 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూత మొగ్గ దశలో లీటరు నీటికి 1 మి.లీటరు డైక్లోరోఫాస్ లేదా 3 గ్రాముల కార్బోరిల్ కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేయాలి. పచ్చ పూత దశలో, మొగ్గ దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 2 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా డైమిథియేట్ లేదా 3 మి.లీటర్ల మిథైల్ డెమాటాన్ లేదా 0.25 మి.లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ మందు పిచికారీ చేయాలి.

బూడిద రంగు తెగులు నివారణ

మామిడి లేత ఆకులు, పూత కాండం, పూలమీద, చిరు పిందెల మీద తెల్లటి పౌడర్ లాంటి బూజు చేరుతుంది. దీన్నే బూజు తెగులు అంటారు. రాత్రుళ్లు చల్లగా, పగలు వేడిగా ఉన్నప్పుడు ఇది ఆశిస్తుంది. దీని వల్ల పూత రాలి పోతుంది. దీని నివారణకు మొగ్గలు కనిపించే దశలో లీటరు నీటికి 3 గ్రాముల గంధకం కలిపి పిచికారీ చేయాలి. పూత దశలో తెగులు కనిపిస్తే హెబ్సా కోనజోల్ 2 మి.లీటర్లు, లేదా ప్రాపికోనజోల్ 1 మి.లీటరు లేదా డినోకాప్ లేదా ట్రిడిమాల్స్ 1 మి. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ సూచనలు పాటించడం వల్ల మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని వివరించారు.

పథకాల అమలులో అలసత్వాన్ని సహించం



ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఏఎన్ఎంను ప్రశ్నిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఉంగుటూరు: రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వాన్ని సహించేది లేదని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ హెచ్చరించారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఈ పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేయడం లేదనే విషయాన్ని గుర్తించి హెచ్ఎం, వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యానర్‌తో కూడిన కౌంటర్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ఐరన్ మాత్రలు ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. ఆ సమయంలో అక్కడ ఏఎన్ఎం, ఆశావర్కర్లు లేకపోవడంతో సీరియస్‌గా తీసుకున్నారు. ఇప్పటివరకు ఏఎన్ఎం ఉండి వెళ్లారని హెచ్ఎం మీరాబాయ్ సర్ది చెప్పడానికి ప్రయత్నించగా, చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేస్తూ కనీసం ఆశావర్కరైనా ఉండాలి కదా అని ప్రశ్నించారు. విషయం తెలుసుకుని హుటాహుటిన అక్కడకు వచ్చిన ఏఎన్ఎం ఎస్తేరురాణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే గురువారం బ్యానర్‌తో కౌంటర్ ఏర్పాటు చేసి పిల్లలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమం ఫొటోలను తీసి తమకు పంపించాలని ఆదేశించారు. ఆ తరువాత విద్యార్థులను కలిసి ఎలా చదువుతున్నారంటూ అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా, నీలాద్రిపురం హైస్కూల్‌కు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ చదలవాడ రాజేంద్ర జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసి కోరగా, ఆమె వెంటనే స్పందించి డీఈఓకు ఫోన్ చేసి ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ వెంట జెడ్పీటీసీ సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఎంపీటీసీ సభ్యులు పెనుగొండ బాలకృష్ణ, సందక శ్రీను, నాయకులు పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీను, ఘంటా ప్రసాదరావు, ఎంతఓ–2 శ్రీనివాసరావు పాల్గొన్నారు.